సాక్షి కర్నూలు

సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నంద్యాలకు చెందిన జేపీ వెంకటేశ్వరరావు రూ.1,00,116 విరాళంగా అందజేశారు.



భ్రామరికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లలకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి మేళ తాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



శ్రీమఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి మఠంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. బృందావన దర్శన క్యూలైన్, పరిమళ ప్రసాదం, అన్నపూర్ణ భోజనశాల కౌంటర్లు కిటకిటలాడాయి.

ఆశల శనగ!



శనగ సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

రైతుభరోసా కేంద్రాల్లో విత్తనం

- ఉమ్మడి జిల్లాకు 95,794 క్వింటాళ్ల కేటాయింపు
- ఇప్పటికే పలు మండలాల్లో 2000 క్వింటాళ్లు సిద్ధం
- 5,500 హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటల సాగు
- 80 శాతం సబ్సిడీతో జొన్న, ఉలువలు, కొర్ర విత్తనాలు
- ఈ ఏడాది గణనీయంగా పెరగనున్న రబీ విస్తీర్ణం
- విత్తనాలను సిద్ధం చేస్తున్న ఏపీ సీడ్స్

కర్నూలు(అగ్రికల్చర్): ఇటీవల కురిసిన వర్షాలతో ఈ ఏడాది రబీ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉండటంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ సీజన్ కొంత నిరాశాజనకంగా మారడంతో పత్తి వంటి కొన్ని ప్రధాన పంటలు వేసుకోలేకపోయారు. ఈ భూముల్లో రబీ పంటల సాగుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఇందువల్ల ఉమ్మడి కర్నూలు జిల్లాకు శనగ విత్తనాలు భారీగా కేటాయిస్తోంది. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ఖరీఫ్‌లో వర్షాభావం వల్ల నల్లరేగడి నేలలైన 67,187 హెక్టార్లలో విత్తనం పడలేదు. ఈ భూముల్లో ఇప్పుడు రైతులు శనగ సాగుకు సిద్ధమయ్యారు. ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ(ఏపీ సీడ్స్) రబీ సీజన్‌లో ప్రధాన పంట శనగ సాగుకు విత్తనాలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే పలు మండలాల్లోని ఆర్‌బీకేలలో శనగ విత్తనాలను అందుబాటులో ఉంచుతోంది.

రైతుభరోసా కేంద్రాల్లో 2000 క్వింటాళ్ల శనగ విత్తనం

శనగ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుండటంతో ఏపీ సీడ్స్ విత్తనాలపై దృష్టి సారించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధానంగా కోవెలకుంట్ల, బనగానపల్లె, అవుకు, సంజామల, ఉయ్యాలవాడ, నందికొట్కూరు, కోడుమూరు, ఆలూరు, ఓర్వకల్లు, చిప్పగిరి, మద్దికెర, కల్లూరు, ఆదోని తదితర మండలాల్లో శనగ ఎక్కువగా సాగవుతోంది. ఏపీసీడ్స్ ముందస్తుగా ఈ మండలాల్లో శనగ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతోంది. ఇప్పటికే 2000 క్వింటాళ్లకుపైగా ఆర్‌బీకేలలో శనగ విత్తనాలను పెట్టడం విశేషం. ఈ నెల 25 నుంచి నంద్యాల జిల్లాలో శనగ విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందుబాటులోకి తెస్తోంది. ప్రభుత్వం రెండు, మూడు రోజుల్లో ధరలు, సబ్సిడీ వివరాలు ఖరారు చేసే అవకాశం ఉంది. ఆ వెంటనే రైతులకు పంపిణీ చేయనున్నారు.

పెరగనున్న సబ్సిడీ

మరో రెండు రోజుల్లో డి-క్రిషి యాప్‌లో శనగ విత్తనా ల కోసం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని వ్యవసాయ శాఖ కల్పిస్తోంది. శనగ విత్తనాలకు సాధారణంగా 25 నుంచి 33 శాతం సబ్సిడీ ఉంటుంది. ఈ సారి నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల కారణంగా సబ్సిడీని పెంచనున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది వరకు ఎకరాకు 25 కిలోల ప్రకారం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సారి ఎకరాకు సబ్సిడీపై ఇచ్చే విత్తనాల పరిమాణాన్ని కూడా పెంచే అవకాశం ఉంది.

5,500 హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు

వర్షాభావంతో ఖరీఫ్ ప్రధాన పంటలైన పత్తి, వేరుశనగ తదితర పంటలు సాగు కాలేదు. కొన్ని ప్రాంతాల్లో సాగు చేసిన పంటల్లో ఎదుగుదల లేకపోవడం వల్ల తొలగించారు. ఈ భూముల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ముందుకొచ్చారు. ఆ మేరకు 5,500 హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు జిల్లా వ్యవసాయ యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. 80 శాతం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు జిల్లాకు విత్తనాలు కేటాయించింది. హైబ్రిడ్ జొన్న విత్తనాలు 337 క్వింటాళ్లు, ఉలువలు 125 క్వింటాళ్లు, కొర్రలు 25 క్వింటాళ్ల ప్రకారం మంజూరయ్యాయి.

ఉమ్మడి జిల్లాకు 95,794 క్వింటాళ్ల విత్తనాలు

రబీ కోసం ఉమ్మడి జిల్లాకు శనగ విత్తనాలు(బెంగాల్‌గ్రామ్) భారీగా కేటాయించనున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా 95,794 క్వింటాళ్ల శనగ విత్తనాలు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమైంది. కర్నూలు జిల్లాకు 67,094, నంద్యాల జిల్లాకు 28,700 క్వింటాళ్లు కేటాయించనున్నట్లు అధికార వర్గాలు స్పష్టం చేశాయి. కర్నూలు.నంద్యాల జిల్లాకు కర్నూలులోని ఏపీసీడ్స్ శనగ విత్తనాలు పంపిణీ చేస్తుంది. ఏపీసీడ్స్ ఒకవైపు ఆర్‌బీకేల్లో విత్తనాలను సిద్ధం చేస్తూనే మరోవైపు ప్రాసెసింగ్ ప్రక్రియను ముమ్మరం చేస్తోంది. ఖరీఫ్‌లో వర్షాలు ఆలస్యం కావడంతో 67,187 హెక్టార్ల నల్లరేగడి నేలల్లో పత్తి సాగు కాలేదు. వీటిల్లో శనగ వేసుకుంటామని రైతులు ముందుకు వచ్చారు. ఏఏ మండలానికి అదనంగా ఎంత మేర శనగ విత్తనాలు అవసరమో.. తెలుసుకొని పంపాలని ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది.ఈ మేరకు మండలాల వారీగా పత్తి సాగుకాని భూములు ఎన్ని హెక్టార్లు ఉన్నాయి... శనగ విత్తనం ఎంత అవసరమనే వివరాలు తీసుకొని ప్రభుత్వానికి నివేదించారు. ఈ ప్రకారం జిల్లాకు అదనంగా 53,444 క్వింటాళ్లు కేటాయించాలని జిల్లా వ్యవసాయ శాఖ ఇది వరకే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. మొదట రబీ కోసం జిల్లాకు 13,650 క్వింటాళ్ల జేజీ-11 శనగ విత్తనాలు కేటాయించారు. వర్షాభావంతో పత్తి సాగు కాకపోవడం వల్ల రబీ కింద శనగ వేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఇందులో భాగంగా అదనంగా శనగ విత్తనాలు కేటాయిస్తోంది.



ఓర్వకల్లు ఆర్‌బీకేలో శనగ విత్తనాలను అందుబాటులో ఉంచుతున్న దృశ్యం

“ శనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి



కర్నూలు, నంద్యాల జిల్లాకు కర్నూలు ఏపీసీడ్స్ ద్వారా శనగతో సహా అన్ని రకాల విత్తనాలు సరఫరా చేస్తున్నాం. రెండు జిల్లాల్లో ఈ సారి ముఖ్యంగా శనగ సాగు భారీగా పెరుగుతోంది. ఇప్పటికే కర్నూలు జిల్లాకు 67,094, నంద్యాల జిల్లాకు 28,700 క్వింటాళ్ల శనగ విత్తనాల కోసం ఆయా జిల్లా యంత్రాంగాలు ప్రతిపాదనలు పంపాయి. ఈ మేరకు ప్రభుత్వం జిల్లాకు విత్తనాలను కేటాయించనుంది. ఏపీ సీడ్స్ దగ్గర రెండు జిల్లాలకు అవసరమైన విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే కర్నూలు జిల్లాలో 2000 క్వింటాళ్లు ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉంచాము. సోమవారం నుంచి నంద్యాల జిల్లాలో శనగ విత్తనాలను పొజిషన్ చేయ నున్నాం.మరోవైపు శనగ విత్తనాల ప్రాసెసింగ్ ప్రక్రియ కూడా చురుగ్గా జరుగుతోంది. ఇటీవలనే ఏపీసీడ్స్ ఎండీ శేఖర్‌బాబు కూడా విత్తనం ప్రాసెసింగ్‌ను పరిశీలించారు.

–శ్రీనివాసరావు, మేనేజర్, ఏపీసీడ్స్, ఉమ్మడి కర్నూలు జిల్లా

తొమ్మిది ఎకరాల్లో సాగు చేస్తున్నాం



ఈ సారి రబీలో తొమ్మిది ఎకరాల్లో శనగ వేయడానికి భూములను సిద్ధం చేసుకున్నాం. ఖరీఫ్ సీజన్‌లో ఈ భూమిలో పంటలు సాగు కాలేదు. రబీలో శనగ వేయనున్నాం. ఇటీవల వర్షాలు పడటం రబీ సాగుకు బాగా కలిసి వస్తోంది. ప్రభుత్వం కూడా సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటోంది. గతంలో సబ్సిడీ విత్తనాల కోసం మండల వ్యవసాయ అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగాల్సి వచ్చేది. ఇపుడు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆర్‌బీకే స్థాయిలోనే సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తుండటం వల్ల వ్యయ ప్రయాసలు తగ్గాయి.

– నారాయణరెడ్డి, రేమదూరు, కల్లూరు మండలం

న్యూస్‌రీల్

12 మండలాల్లో వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని 12 మండలాల్లో ఆదివారం వర్షం కురిసింది. కొత్తాళంలో 38.4, మంత్రాలయంలో 23.2, కోసిగిలో 18.4, పెద్దకడుబూరులో 9.2, గోనెగండ్లలో 8.4, సి.బెళగల్‌లో 8.2, ఎమ్మిగనూరులో 6.4, నందవరంలో 5.6, పత్తికొండలో 5.4, తుగ్గలిలో 5.2, ఓర్వకల్లులో 2.2, ఆదోనిలో 1.8 మి.మీ. ప్రకారం వర్షపాతం నమోదైంది. సెప్టెంబరు నెల సాధారణ వర్షపాతం 11.5 మి.మీ ఉండగా... ఇప్పటి వరకు 79.9 మి.మీ వర్షపాతం నమోదైంది. రానున్న నాలుగైదు రోజుల్లో వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ అధికారులు ప్రకటించారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

శ్రీశైలం చేరుకున్న నూతన ఈఓ




నూతన ఈఓగా నియమితులైన పెద్దిరాజుకు స్వాగతం పలుకుతున్న ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి నూతన కార్యనిర్వాహణాధికారిగా నియమితులైన డి.పెద్దిరాజు ఆదివారం రాత్రి శ్రీశైలం చేరుకున్నారు. ఆయనకు ప్రస్తుత ఈఓ లవన్న, దేవస్థానం అధికారులు స్వాగతం పలికారు. ఆయన సాక్షిగణపతిని దర్శించుకున్నారు. సోమవారం పెద్దిరాజు బాధ్యతలు చేపట్టనున్నారు. నూతన ఈఓను కలిసిన వారిలో దేవస్థానం ఎగ్జిక్యూటీవ్ వి.రామకృష్ణ,. ఏఈఓ మోహన్, పర్యవేక్షకులు అయ్యన్న, ఇతర సిబ్బంది ఉన్నారు.

‘సుంకేసుల’లో 1.026 టీఎంసీల నిల్వ

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌లో 1.026 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ఆదివారం డ్యామ్ అధికారులు తెలిపారు. కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇన్‌ఫ్లో నిలిచిపోయిందని, దిగువకు నీటి విడుదల నిలిపేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి



బయోమెట్రిక్ హాజరును పరిశీలిస్తున్న రంగలక్ష్మి

ఓర్వకల్లు: ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు(జేడీ) రంగలక్ష్మి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం, బాలికల వసతి గృహాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా వసతి గృహాలలో విద్యార్థుల హాజరు శాతం, భోజన వసతులపై ఆరాతీశారు. బాలుర వసతి గృహంలో మెనూ ప్రకారం ఉప్మా వడ్డించాల్సి ఉండగా ఉగ్గాని పెట్టటడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్ వార్డెన్ సమయానికి లేకపోవడంతో మండిపడ్డారు. జగనన్న విద్యా కానుక కిట్లు, మరుగుదొడ్ల సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

మహావీర్ శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న జైనులు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని జైన్ మతస్థుల ఆధ్వర్యంలో మహావీర్ శోభాయాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. స్థానిక బంగారు బజార్‌లో వెలిసిన జైన్ మందిరం నుంచి పీఎస్ రోడ్డు మీదుగా పాత బస్టాండు విక్టోరియాపేటలో వెలసిన జైన్ మందిరం వరకు ప్రధాన రహదారుల్లో శోభాయాత్ర నిర్వహించారు. రథంలో మహావీర్ చిత్రపటాన్ని ఉంచి డోలు, సన్నాయిలు, కోలాటాల మధ్య భక్తులు ఊరేగింపు నిర్వహించారు. మహావీర్‌స్వామి పూజ ల్లో భాగంగా 8 రోజులపాటు ఉపవాస దీక్షలు చేపట్టిన నేటితో దీక్షలు ముగియడంతో శోభాయాత్ర నిర్వహించినట్లు జైన్ పెద్దలు తెలిపారు.

నిమజ్జనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు



వినాయక ఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు కల్చరల్: నగరంలో ఈ నెల 26వ తేదీ నిర్వహించే వినాయక నిమజ్జనోత్సవాన్ని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి శనివారం నగరంలోని రాంబొట్ల దేవాలయం, వినాయక ఘాట్, జొహరాపురం సమీపంలో కేసీ కెనాల్ గేట్‌లను కలెక్టర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంతంగా నిమజ్జనోత్సవాన్ని జరుపుకోవాలన్నారు. కేసీ కెనాల్‌లో 8 అడుగుల నీరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొదటగా రాంబొట్ల దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాన్ని, ఓల్డ్‌టౌన్ నుంచి వినాయక విగ్రహాలు వచ్చే రహదారిని పరిశీలించారు. రహదారి పొడవునా ఉన్న అడ్డకుంలన్నీ తొలగిస్తూ కావాల్సిన విధంగా లైట్లు, తాగు నీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్రేన్ల సహాయంతో నిమజ్జన కార్యక్రమం వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్ అండబీ అధికారులను ఆదేశించారు. మత్స్య శాఖకు సంబంధించి 120 మంది గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లను ఘాట్‌ల వద్ద ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని మత్స్య శాఖ అధికారినిని ఆదేశించారు. కేసీ కెనాల్‌లో నీటిని 8 అడుగులు ఉండేలా జొహరాపురం దగ్గర ఉన్న కేసీ కెనాల్ గేట్లను మూసి వేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు. కార్యక్రమంలో నగర మేయర్ బీవై రామయ్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ, ఆర్డీవో హరిప్రసాద్, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో స్థానిక ప్రభుత్వాలు బలోపేతం

- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు (అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా స్థానిక ప్రభుత్వాలు బలోపేతం అయ్యాయని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. స్థానిక డీపీఆర్‌సీ భవనంలో ఆగస్టు 29వ తేదీ నుంచి పంచాయతీ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు అనంతరం పల్లె ప్రజల సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం లభిస్తోందన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తాగునీరు, వీధిదీపాలు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ గ్రామ పంచాయతీల వైపు ప్రజలను ఉత్తేజ పరిచి అవగాహన కల్పించాలన్నారు. సర్పంచ్‌ల సహకారంతో గ్రామాల అభివృద్ధికి పని చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి మండల, జిల్లా పరిషత్ నిధులను మంజూరు చేస్తామన్నారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు కమిటీలను ఏర్పాటు చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా సేవకులుగా పని చేయాలన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో ఆక్రమణలను ఎదుర్కొనేందుకు పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్లపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి సచివాలయంలో విడిగా ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటలకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు. డీపీఓ నాగరాజు నాయుడు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి గ్రామ పంచాయతీలు సొంత ఆదాయ వనరులను సమకూర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా శిక్షణ పర్యవేక్షకులు వెంకటరత్నం, డీపీఆర్‌సీ ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, రాజవర్ధన్, మాస్టర్ ట్రైనర్లు బి మల్లికార్జున, వై ప్రభాకర్, వి జేమ్స్ కృపావరం, అజయ్ భాస్కర్, అసరత్‌బాషా, జగన్నాథం, పద్మావతి, మహేశ్వరి, సునీత పాల్గొన్నారు.

30లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

కర్నూలు సిటీ: ఈ ఏడాది ఫిబ్రవరి/మార్చి, గతేడాది మార్చి నెలల్లో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు వచ్చే ఏడాది పరీక్షలు రాసేందుకు ఈ నెల 30వ తేదీలోపు ఫీజు చెల్లించాలని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్యశెట్టి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు మళ్లీ కాలేజీకి వచ్చి చదువుకుని పరీక్షలు రాసేందుకు ఇంటర్మీడియట్ బోర్డు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఆయా ప్రాంతాల్లోని కాలేజీ ప్రిన్సిపాళ్లను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు

- వచ్చే నెల 6 వరకు నిర్వహణ

కర్నూలు(సెంట్రల్): వివిధ ఉద్యోగాల భర్తీ కోసం ఏపీపీఎస్సీ ఈనెల 25 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు నిర్వహిస్తోందని పరీక్షల కో ఆర్డినేటర్ డీఆర్వో కె.మధుసూదనరావు తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో పరీక్షల సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అయాన్ డిజిటల్ బృందావన్, కేవీసుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, గ్రూపు-4, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా పరీక్షలు నిర్వహించే కేంద్రాల దగ్గర పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించకూడదని పరీక్షల నిర్వహణ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టాలపై ‘వందే భారత్’ పరుగు

- సూపర్ ఫాస్ట్ రైలును ప్రారంభించిన ప్రధాని
- కాచిగూడ నుంచి బెంగళూరుకు వెళ్లిన రైలు
- స్వాగతం పలికిన ప్రజా ప్రతినిధులు, జిల్లా వాసులు



కర్నూలులో వందేభారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ సంజీవ్ కుమార్, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మేయర్ రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తదితరులు

కర్నూలు(రాజ్‌విహార్): ‘వందే భారత్’ రైలు పట్టాలపై పరుగు తీసింది. ఈ సూపర్ ఫాస్టు ట్రెన్‌ను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆదివారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించగా కాచిగూడ స్టేషన్‌లో మధ్యాహ్నం 12:30గంటలకు కదిలింది. కర్నూలుకు సాయంత్రం 4:21గంటలకు చేరుకుంది. ఈ రైలుకు ప్రజా ప్రతినిధులతో పాటు జిల్లా ప్రజలు స్వాగతం పలికారు. భారత రైల్వే శాఖ రూపొందించిన ఈ వందే భారత్ రైలు తొలి సారిగా కర్నూలుకు రావడంతో సెల్ఫీల కోసం జనం, యువత ప్రత్యేక ఆసక్తి చూపారు. కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి, మేయర్ రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ జెండా ఊపడంతో కర్నూలు నుంచి సాయంత్రం 4:34 గంటలకు ఈ రైలు యశ్వంత్‌పూర్ (బెంగళూరు)కు బయలుదేరి వెళ్లింది. ముందుగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. కర్నూలు మీదుగా వందేభారత్ రైలు నడపడం అభినందనీయమన్నారు. రైల్వే ప్రాజెక్టుల విషయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే కర్నూలు రైల్వే స్టేషన్ అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ కర్నూలు సిటీ స్టేషన్ మీదుగా మరిన్ని రైళ్లు నడిపితే ప్రయాణికులకు మేలు జరుగుతుందన్నారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు వందే భారత్ రైళ్లు ప్రారంభమయ్యాయని, ఇందులో పీఎం మోదీ సహాయంతో పాటు సీఎం జగన్ ప్రత్యేక చొరవ ఉందని వెల్లడించారు. కొత్త లైన్లు, రైళ్లతో ప్రయోజనాలు ఉంటాయన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. పేద, సామాన్య ప్రయాణికులకు రైళ్లు ఎంతో సేవలందిస్తున్నాయన్నారు. ఇదిలా ఉండగా వందే భారత్ రైలును చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలు వచ్చినా అధికారుల ఏర్పాట్ల లోపం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రైలును చూసే, సెల్ఫీలు తీసుకునే క్రమంలో తోపులాట జరిగింది.



సూపర్ ఫాస్ట్ రైలును ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు



సెల్ఫీ తీసుకుంటున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

డోన్‌లో ఘన స్వాగతం

డోన్ రూరల్: వందేభారత్ రైలు కాచిగూడ నుంచి ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు డోన్ రైల్వే జంక్షన్‌కు చేరుకుంది. రైలుకు స్థానిక ప్రజలతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఏపీఐఐసీ డైరెక్టర్ మర్రిగోవిందరాజులు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి స్వాగతం పలికారు. సూపర్ ఫాస్ట్ రైలు ప్రారంభం కావడంతో హైదరాబాద్ నుంచి కర్నూలు, అనంతపురం, ధర్మవరం మీదుగా బెంగళూరు వెళ్లే ప్రయాణికులకు సమయం కలిసి రానుందని, రెండున్నర గంటలు ముందే గమ్యస్థానానికి చేరుకోవచ్చని రైల్వే స్టేషన్ మాస్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇదిలా ఉండగా బుధవారం మినహా అన్ని రోజులు తిరిగే ఈ రైలుకు డోన్ జంక్షన్‌లో స్టాపింగ్ పెట్టక పోవడం పట్ల ప్రయాణికులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.



డోన్‌లో స్వాగతం పలుకుతున్న దృశ్యం

క్లుప్తంగా

శవమై తేలిన యువకుడు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ వెంకటరెడ్డి

ఆళ్లగడ్డ: మూడు రోజుల క్రితం గణేష్ నిమజ్జనం సందర్భంగా ప్రమాదవశాత్తూ వక్కిలేరు వాగులో గల్లంతైన యువకుడి ఆదివారం శవమై కనిపించాడు. పట్టణంలోని సీతారామ నగర్‌కు చెందిన భూమా చంద్రశేఖర్‌రెడ్డి (30) శుక్రవారం రాత్రి గణేష్ ప్రతిమను నిమజ్జనం చేస్తూ క్రేన్‌పై నుంచి జారి వాగులో పడి గల్లంతయ్యాడు. రెండు రోజులుగా పోలీస్, ఫైర్ అధికారుల బృందం గాలింపు చేపట్టినా ఫలితం కనిపించలేదు. ఆదివారం కోటకందుకూరు గ్రామ సమీపంలోని చెక్ డ్యాం వద్ద చేపలు పట్టే కొందరు వ్యక్తులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికితీసి పంచనామా నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి నరసింహారెడ్డి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు.

మద్దిలేరు వాగులో వ్యక్తి గల్లంతు


నర్సప్ప (ఫైల్)

మహానంది: బండి ఆత్మకూరు మండలం జీసీ పాలెం గ్రామానికి చెందిన మేదరి నర్సప్ప(45) మద్దిలేరు వాగులో ఆదివారం ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. కులవృత్తిలో భాగంగా తడికలు అల్లుకుంటూ జీవనం సాగించే నర్సప్ప నారాయణాపురంలో పనులు పూర్తి చేసుకుని స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో మద్దిలేరువాగులో నీటి ఉధృతికి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వాగు వెంట గాలించినా ఆచూకీ కనిపించలేదు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన వెంకటరమణ

మహానంది: రెండు నిమిషాలుంటే ఇంటికి చేరే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. గాజులపల్లె మజరా గ్రామమైన ఆంజనేయపురం గ్రామానికి చెందిన ఎలగాని వెంకటరమణ(47) టీ తాగేందుకు సమీపంలోని గాజులపల్లె మెట్టుకు వద్దకు చేరుకున్నాడు. అనంతరం నడుచుకుంటూ ఇంటికెళ్తుండగా వెనుక నుంచి స్కార్పియో వాహనం ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసుకుని వెంకటరమణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,619.85
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:60.905
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:3,455
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:9,885

ముమ్మరంగా రీసర్వే

- మొదటి విడతలో 68, రెండో విడతలో 22 గ్రామాల్లో పూర్తి
- 12,547 మంది రైతులకు భూహక్కు పత్రాల పంపిణీకి చర్యలు
- మూడో విడతలో 160 గ్రామాల్లో సర్వే చేపట్టేందుకు ప్రణాళిక
- జిల్లాలోని 472 గ్రామాల్లో ఫీల్డ్- పీఓఎల్‌ఆర్ ప్రక్రియ పూర్తి


కర్నూలు(సెంట్రల్): వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకంలో భాగంగా నూరేళ్ల తరువాత భూముల కొలతలు, రికార్డుల స్వచ్ఛీకరణ కోసం చేపట్టిన రీసర్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలో రెండు విడతలుగా 90 గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యింది. మూడో విడతలో మరో 160 గ్రామాల్లో రీసర్వే కోసం ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసింది.

మూడో విడత రీసర్వే

ప్రతి రైతు భూమిని సర్వే చేయాలని, ప్రతి రైతు వివరాలను మరోసారి పరిశీలన చేసి వాస్తవికత ఆధారంగా పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఎప్పుడో బ్రిటీషర్ల కాలంలో జరిగిన సర్వేతో క్షేత్ర స్థాయిలో అనేక భూ సమస్యలు పేరుకుపోయాయి. వాటికి పరిష్కారాలను చూపడంపై గత పాలకులెవరూ దృష్టి సారించలేదు. ఈ క్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. భూముల రీసర్వే, రికార్డుల స్వచ్ఛీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మళ్లీ మళ్లీ భూ సమస్యలు, వివాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కర్నూలు జిల్లాలో మొత్తం మూడు రెవెన్యూ డివిజన్‌లో 26 మండలాల పరిధిలో 472 గ్రామాలు ఉన్నాయి. వీటిలో మొదటి విడతలో 68 గ్రామాలు, రెండో విడతలో 21 గ్రామాల్లో సర్వే ఆఫ్ ఇండియా నేతృత్వంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రీసర్వేను పూర్తి చేశారు. మూడో విడతలో 160 గ్రామాల్లో రీసర్వేను చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే గ్రౌండ్ ట్రూతింగ్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సర్వే ఆఫ్ ఇండియా నుంచి ఓఆర్‌ఐమ్యాపులు వచ్చిన రోవర్స్ సాయంతో అధికారుల బృందాలు రీసర్వేను నిర్వహిస్తున్నాయి. మూడో విడతను అక్టోబర్ 30వ తేదీలోపు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మూడో విడత పూర్తయితే జిల్లాలో 240 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసినట్లు అవుతుంది. మిగిలిన 232 గ్రామాల్లో రీసర్వే చేపట్టాల్సి ఉంటుంది.

ఫీల్డ్–పీఓఎల్‌ఆర్ అన్ని గ్రామాల్లో పూర్తి..

జిల్లాలోని 472 గ్రామాల్లో మొదటి విడతగా చేపట్టిన 68 గ్రామాల్లో ఏరియల్ సర్వే తరువాత పీఓఎల్‌ఆర్(ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్)ను చేపట్టారు. దీంతో సర్వే చేయడం ఆలస్యం అవుతుండడంతో ప్రభుత్వం కొత్త ఆలోచనకు తెర లేపింది. మొదటి ఫీల్డ్ –పీఓఎల్‌ఆర్ చేపట్టాలని నిర్ణయించింది. దీని ప్రకారం మొదట ఫీల్డ్‌పై సరిహద్దులు చూసుకొని వాటి ప్రకారం రికార్డులను స్వచ్ఛీకరించుకున్నారు. అలా మొదటి విడత కాక మిగిలిన 404 గ్రామాల్లో ఫీల్డ్ పీఓఎల్‌ఆర్‌పూర్తి అయింది. ఈ క్రమంలో రీసర్వేకు సంబంధించి ఓఆర్‌ఐ మ్యాపులు వచ్చిన వెంటనే రైతులకు నోటీసులు ఇచ్చి రోవర్ల సాయంతో సరిహద్దు రాళ్లను నాటుతున్నారు.


రైతులకు అందజేసే జగనన్న భూ హక్కు పత్రం, పట్టాదారు పాసు పుస్తకం

భూ హక్కుపత్రాల పంపిణీ...


రెండో విడతలో 22 గ్రామాలకు రైతులకు సంబంధించి 73,060 ఎకరాల్లో రీసర్వే జరిగింది. అలాగే ఆయా గ్రామాల రైతుల పొలాలకు సరిహద్దురాళ్లను సైతం నాటారు. రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన భూ హక్కు పత్రాలను అందజేస్తున్నారు. రెండో విడతలో 12,547 మంది రైతులకు భూ హక్కు పత్రాలు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే దాదాపు 8 వేల మంది రైతులకు భూహక్కు పత్రాలను అందజేశారు. మిగిలిన వారికి సెప్టెంబర్ 25 లోపు అందజేయాలన్న లక్ష్యంతో అధికారులు పని చేస్తున్నారు. మరోవైపు మొదటి విడతలో 1,26,817.5 ఎకరాలకు సంబంధించి 69,903 మందిరైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. దీంతో రెండు విడతల్లో కలిపి 1,99,877.5 ఎకరాలకు సంబంధించి 82,450 మంది రైతులకు భూ హక్కు పత్రాలను అందజేశారు.

విశిష్ట సంఖ్య ఆధారంగానే రిజిస్ట్రేషన్...

రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్లకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా రైతుల భూముల క్రయ, విక్రయాలను ఆ భూమికి ఉన్న విశిష్ట సంఖ్య ఆధారంగానే చేపడతారు. తద్వారా ఒక భూమి డబుల్ రిజిస్ట్రేషన్ అవ్వడానికి వీలు కుదరదు. ప్రయత్నించినా ఆ పట్టాదారు పాసు పుస్తకంతో అనుసంధానమైనా ఆధార్, మొబైల్ నంబర్లకు మెసేజ్ వెళ్లితే సంబంధిత యజమానులు అప్రమత్తమవుతారు.


రీసర్వేలో భాగంగా ఏరియల్ ఫై చేస్తున్న దృశ్యం

తప్పులు లేకుండా పరిశీలన



ప్రతి భూ హక్కు పత్రం, పట్టాదారు పాసు పుస్తకంలోని వివరాలను పకడ్బందీగా పరిశీలన చేయాలి. ముద్రించిన పాసు పుస్తకంలో డివిజన్, మండలం, గ్రామం పటా టనంబర్, ఖాతా నంబర్, ఆధార్, మొబైల్ నంబర్లు, విస్తీర్ణం, విశిష్ట నంబర్లను పరిశీలించి తప్పులు లేకుండా చూడాలి. టైటిల్ డీడ్‌లో తేడాలు ఉంటే రైతులకు బ్యాంకులు లోన్ ఇవ్వరు. సరైన వివరాలతోనే డిజిటలీకరించిన పాసుపుస్తకాలను రైతులకు అందజేసేలా తహశీల్దార్లు చర్యలు తీసుకోవాలి. తప్పులను సరిదిద్దడానికి ప్రింటైన పుస్తకాలను రీప్రింట్‌కు పంపేలా చర్యలు తీసుకుంటున్నాం.

– నాగప్రసన్న లక్ష్మీ, కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీ, కర్నూలు

ప్రతి పొలానికి ఒక విశిష్ట నంబర్

క్షేత్ర స్థాయిలో భూమి వివరాల కోసం రీసర్వే, భూ రికార్డుల్లో మార్పుల కోసం రికార్డుల స్వచ్ఛీకరణను గ్రామాల వారీగా నమోదు చేయిస్తున్నారు. అందులో భాగంగా రీసర్వే, పీఓఎల్‌ఆర్ ప్రక్రియలు పూర్తయిన రైతులకు డిజిటలీకరించిన జగనన్న భూ హక్కు పత్రం, పట్టాదారు పాసు పుస్తకం ఇస్తున్నారు. అందులో సర్వే చేసిన ప్రతి భూమికి ఒక విశిష్ట సంఖ్యను కేటాయిస్తారు. ఆ సంఖ్యను మరెక్కడా వినియోగించరు. ప్రస్తుతం ప్రతి భూమికి సర్వే నంబర్లు ఉన్నా డివిజన్లుగా విభజనతో మోసాలకు ఆస్కారం ఎక్కువైంది. ఆ విశిష్ట సంఖ్య రైతు ఆధార్, మొబైల్ నంబర్లతో అనుసంధానమై ఉంటుంది. ఎవరైనా మార్చాలని చూసినా వారి హక్కు దారుడి మొబైల్‌కు మెసేజ్ వెళ్తుంది. అప్పుడు మోసాల నుంచి విముక్తి కలిగించడానికి వీలు కలుగుతుంది. అలాగే రీసర్వే వివరాలను తెలిపేలా భూ కమతం పటం ఉంటుంది. దీనిలో భూమి కొలతలతోపాటు సర్వే మ్యాపు ఉంటుంది. అంతేకాక అందులో రైతుల వివరాలు తెలుగు, ఇంగ్లీషులో ఉంటాయి. అలాగే ఖాతా నంబర్, విస్తీర్ణం, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ల వివరాలు కూడా ఉంటాయి.

శ్రీమఠంలో సినీ నటులు


రాఘవేంద్రస్వామి మఠంలో సినీనటి హరిప్రియ, నటుడు వశిష్ట నిరంజన్ సింహా

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనార్థం హీరోయిన్ హరిప్రియ, ఆమె భర్త, నటుడు వశిష్ఠ నిరంజన్ సింహా ఆదివారం మంత్రాలయం వచ్చారు. మఠం పీఆర్వో బిందుస్వామి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలుకగా ముందుగా గ్రామ దేవతకు అర్చన చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. నటి హరిప్రియ తెలుగులో పిల్ల జమిందార్, జైసింహా, గలాట, తకిట తకిట సినిమాల్లో నటించారు. ఇక నటుడు వశిష్ఠ నిరంజన్ సింహా, కేజీఎఫ్ సినిమాలో విలన్ పాత్ర పోషించారు. ఇటీవల వీరికి వివాహం కాగా మంత్రాలయం వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

సాహితీ స్రవంతి జిల్లా నూతన కమిటీ ఎంపిక



ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణి యాదవ్

కర్నూలు కల్చరల్: సాహితీ స్రవంతి జిల్లా నూతన కమిటీ ఎంపిక జరిగింది. ఆదివారం కేకే భవన్‌లో జరిగిన సాహితీ స్రవంతి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎం.పి. బసవరాజు, అధ్యక్షులుగా ఆవుల బసప్ప, ప్రధాన కార్యదర్శిగా ఆవుల చక్రపాణి యాదవ్, కోశాధికారిగా దాడిపోగు అయ్యన్న, ఉపాధ్యక్షులుగా విజయులు, సహాయ కార్యదర్శులుగా నాగమణి, పార్వతయ్య, భాస్కర్, ప్రచార కార్యదర్శిగా పఠాన్ సుల్తాన్ ఖాన్‌లను ఎంపిక చేశారు. అంతకు ముందు సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ మాట్లాడారు. కవయిత్రి నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమితి సభ్యులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై దృష్టిసారించాలి


బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న డీఏహెచ్‌వో గోవిందనాయక్

నంద్యాల(సెంట్రల్): ఉద్యోగులు ఓ వైపు వృత్తిపరమైన బాధ్యతలు నిర్వహిస్తూనే మరో వైపు క్రీడలు, వ్యాయామానికి ప్రాధాన్యం ఇచ్చి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి గోవిందనాయక్ సూచించారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీలను డీఏహెచ్‌వో గోవిందనాయక్, నంద్యాల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు వెంకటసుబ్బారెడ్డి, ఏపీ ఎన్జీవో నాయకులు వెంకటేశ్వరరెడ్డి, జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. నంద్యాల, ఆళ్లగడ్డ డివిజన్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో నంద్యాల డివిజన్ 11 పరుగుల తేడాతో విజయం సాధించింది. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోస్ ఉమ్మడి జిల్లా కోశాధికారి యాదవ్, వెటర్నరీ సిబ్బంది, ఏహెచ్ఏలు, ఏపీఎన్జీవీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై కామాంధుడి అత్యాచారం

కోవెలకుంట్ల: కామంతో కళ్లు మూసుకపోయిన ఓ కామాంధుడు 60 ఏళ్ల పైబడి మతిస్థిమితం సరిగాలేని ఓ వృద్ధురాలిపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఈ ఘటన కోవెలకుంట్లలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మౌలానీ అందించిన సమాచారం మేరకు.. సంజామలకు చెందిన ఓ వృద్ధురాలు కోవెలకుంట్ల పట్టణంలో తిరుగుతుండగా శనివారం రాత్రి గుర్తు తెలియని కామాంధుడు మద్యం మత్తులో బైక్‌పై ఎక్కించుకుని స్థానిక గుంజలపాడు రహదారిలో వైపు తీసుకెళ్లి అత్యాచారం చేసి ఆ వృద్ధురాలిని అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. ఘటన జరిగిన తర్వాత రాత్రి సమయంలో రైల్వేస్టేషన్ మీదుగా నడుచుకుంటూ వస్తూ వృద్ధురాలు తీవ్ర రక్తస్రావంతో ఓ పెట్రోల్ బంకు సమీపంలో కింద పడిపోయింది. గుర్తించిన పెట్రోల్ బంకు నిర్వాహకులు పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు వృద్ధురాలిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం రాత్రి కోవెలకుంట్ల నుంచి వివిధ రహదారులవైపు వెళుతున్న వాహన సీసీ ఫుటేజీలను పరిశీలించి కామాంధుడి ఆచూకీని కనుగొనే ప్రయత్నం చేస్తున్నారు. వృద్ధురాలిపై అత్యాచారం చేసిన కామాంధుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ బీజేపీ నాయకులు లింగన్న, చాందిని, సీతారామయ్య, సుధాకర్‌రెడ్డి, రవితేజ రెడ్డి, తదితరులు ఆదివారం ఎస్‌ఐ మౌలానీని కలిసి వినతిపత్రం అందజేశారు.

బాంబుల కేసు దర్యాప్తులో పురోగతి

- పోలీసుల అదుపులో ఆరుగురు వ్యక్తులు
- అనుమానితులు మాజీ ఎమ్మెల్యే అనుచరులుగా చర్చ?

పగిడ్యాల: రెండు నెలల క్రితం నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం కొత్త ముచ్చుమర్రిలో అనుమానాస్పదంగా లభ్యమైన బాంబుల కేసు దర్యాప్తులో పోలీసులు పురోగతి సాధించారు. కొత్తముచ్చుమర్రిలోని రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి ముఖ్య అనుచరుడు బోయ మధు అలియాస్ అల్లరి మధు ఇంటిపైన ఉన్న వాటర్ ట్యాంక్‌లో గుర్తు తెలియని వ్యక్తులు 22 నాటు బాంబులను మూటగా కట్టి పెట్టారు. ఈ ఏడాది జూలై 25వ తేదీన మధు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నందికొట్కూరు రూరల్ సీఐ విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జున కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పలు కోణాల్లో విచారించిన పోలీసులు అదే గ్రామానికి చెందిన బోయ పెద్ద రంగడు, ఆర్ఎంపీ కరీంబాషా, తెలుగు దుబ్బన్న, మల్యాల బషీర్, బొల్లవరం స్వాములు, చిన్న దంతాలు అనే వ్యక్తులను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం కర్నూలుకు తరలించారు. పోలీసులు అదుపులో ఉన్న వారంతా మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అనుచరులుగా చర్చించుకుంటున్నారు. కాగా ఆ బాంబులు ఎవ్వరిని అంతమొందించడానికి తెచ్చారనే చర్చ జోరుగా సాగుతోంది.

మహారాష్ట్ర పోలీసుల అదుపులో ఏటీఎం చోరీ ముఠా సభ్యులు

- ముగ్గురి అరెస్ట్, ఇద్దరు పరారీ
- కంటైనర్, కారు స్వాధీనం


రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న కంటైనర్, కారు

డోన్ రూరల్: బ్యాంక్ ఏటీఎంలను కొల్లగొట్టే మహారాష్ట్ర ముఠా సభ్యులను రాష్ట్ర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్ర రాష్ట్రం నాగపూర్‌కు చెందిన ఐదుగురు ముఠా సభ్యులు బెంగళూరు – హైదరాబాద్ జాతీయ రహదారిపై ఒక కారు, కంటైనెర్‌తో ఏపీ మీదుగా తెలంగాణలోకి వెళ్తుండగా మహారాష్ట్ర పోలీసులు వారిని వెంబడించారు. బెంగళూరు – కర్నూలు జాతీయ రహదారిపై వెళ్తున్నట్లు తెలుసుకుని కర్నూలు పోలీసు ఉన్నతాధికారులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు డోన్ పోలీసుల సహాయంతో మహారాష్ట్ర పోలీసులు వెల్దుర్తి సమీపంలో వాహనాలను అడ్డగించారు. కాగా ముఠా సభ్యుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకోగా, ఇద్దరు పరారీ అయ్యారు. వీరి నుంచి కంటైనర్, కారును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ముగ్గురి ముఠా సభ్యులను నాగపూరుకు తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


రైల్వే ట్రాక్ పక్కన పడి ఉన్న మృతదేహం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని నూనెపల్లి సమీపంలోని రైల్వేట్రాక్ ప్రక్కన ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి శవం లభ్యమైనట్లు రైల్వే పోలీసులు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ ఖలీల్ అహమ్మద్ తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం రైల్వే ట్రాక్ పక్కన వ్యక్తి మృతదేహం కనిపించటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల సర్వజన ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు 35 ఏళ్లు ఉంటాయని నీలం రంగు చొక్కా, సిమెంట్ రంగు జీన్స్ ధరించి చాడు. మృతుడి ముఖంపై గాయాలు ఉన్నాయి. దీంతో హత్య, ఆత్మహత్య, ప్రమాదమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చిరుతపులి దాడిలో మేక మృతి

పెద్దకడబూరు: చిరుతపులి దాడిలో మేక మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గవిగట్టు గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు మరే చిన్న అయ్యన్న తెలిపిన వివరాల మేరకు.. గ్రామ సమీపంలోని ఎయిర్‌టెల్ టవర్ దగ్గర మేకల మందను ఏర్పాటు చేసుకున్నాడు. చుట్టూ కంచెను కూడా ఏర్పాటు చేసుకున్నాడు. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత చిరుత మేకల మందపై పడి దాడిచేసింది. ఒక మేకను నోట కరుచుకొని ఎత్తికెళ్లింది. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గొర్రెల కాపరులు కోరారు.

వజ్రాన్వేషణ!


గార్గేయపురం సమీపంలో వజ్రాల కోసం వెతుకున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం గార్గేయపురం డంప్‌యార్డుకు వెళ్లే దారిలో వజ్రాలు లభిస్తున్నాయన్న ప్రచారం ఊపందుకుంది. నెల రోజుల క్రితం గార్గేయపురానికి చెందిన వ్యక్తికి రూ.30లక్షల విలువ వజ్రం దొరికిందనే ప్రచారం విస్తృతంగా సాగడంతో ఆశాజీవులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు భారీగా తరలివస్తున్నారు. సమీపా పల్లెతోపాటు ఇతర మండలాలకు చెందిన ప్రజలు సైతం వజ్రాన్వేషణకు వస్తున్నారు. బ్రాహ్మణకొట్కూరు, నందికొట్కూరు, ఆత్మకూరు, శ్రీశైలం, నన్నూరు, ఓర్వకల్లు గ్రామాలకు చెందిన ప్రజలు ఇక్కడికి వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు వజ్రాన్వేషణలో నిమగ్నమయ్యారు.

ఉరివేసుకొని విద్యార్థి ఆత్మహత్య

కల్లూరు: లక్ష్మీపురం గ్రామంలో ఓ విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప తెలిపిన వివరాలు... లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎరుకలి ద్రోణ (15) కర్నూలులోని శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. చదువుకోవడం ఇష్టంలేని ద్రోణ స్కూలుకు సరిగా వెళ్లకుండా ఇంటి వద్దనే ఎక్కవ రోజులు గడుపుతుండేవాడు. తల్లిదండ్రులు మంచిగా చదువుకోవాలని సర్ది చెప్పి స్కూలుకు పంపేవారు. శనివారం ద్రోణ స్కూలుకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్నాడు. రాత్రి భోజనం చేసి తల్లిదండ్రులు ఇంటిపై గదిలో, బాలుడు కింది గదిలో పడుకున్నాడు. ఆదివారం ఉదయం తల్లిదండ్రులు బాలుడు పడుకున్న గదిలోకి వెళ్లి చూడగా హాలు పైకప్పుకు ఉండే ఇనుప కొక్కికి చీరతో ఉరివేసుకున్నాడు. తండ్రి ఇంకా కొంతమంది కలిసి బాలుని కిందకి దించగా అప్పటికే మృతిచెందాడు. తండ్రి శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

నిమజ్జనోత్సవానికి కట్టుదిట్టమైన భద్రత

- బందోబస్తు విధులకు 2 వేల మంది పోలీసులు
- రేపు కర్నూలు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

కర్నూలు: నగరంలో ఈ నెల 26న గణేశ్ నిమజ్జనోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం భద్రతను కట్టుదిట్టం చేసింది. ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా వేడుకలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. నిమజ్జనం సందర్భంగా బందోబస్తు విధులకు సుమారు 2వేల మంది పోలీసు సిబ్బంది వినియోగించనున్నారు. 14 మంది డీఎస్పీలు, 46 మంది సీఐలు, ఆర్‌ఐలు, 82 మంది ఎస్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు, 236 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 601 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 342 మంది హోం గార్డులు, మూడు స్పెషల్ పార్టీ బృందాలతో పాటు ఏపీఎస్పీ బలగాలను బందోబస్తు విధులకు వినియోగించనున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినా, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలతో ముఖ్యమైన ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిమజ్జనం ముగిసే వరకు డ్రోన్, సీసీ, వీడియో కెమెరాలతో చిత్రీకరించేందుకు పోలీసు శాఖ ఏర్పాటు చేసింది. అసాంఘిక శక్తులు, అల్లరిమూకలపై ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేశారు. విగ్రహాలను తరలించడానికి ముందు రోజే వాహనాలు, క్రేన్‌లను సిద్ధంగా ఉంచారు.

నిబంధనలు ఇవీ..

- ఊరేగింపు వాహనాలకు చిన్న పిల్లలను దూరంగా ఉంచాలి.
- నిమజ్జనానికి వచ్చే మహిళలు, వృద్ధులు, పిల్లలు ఘాట్ల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలి.
- విగ్రహాలు బయలుదేరేటప్పుడు కరెంటు తీగల వద్ద నిర్వాహకులు జాగ్రత్తగా ఉండాలి.
- ఆసుపత్రుల వద్ద రోగులకు ఇబ్బందులు కలిగించరాదు.
- విగ్రహ ఊరేగింపు సమయంలో ఇతరుల మనోభావాలు కించపరిచే విధంగా వ్యవహరించరాదు.
- హోరెత్తించే లౌడ్‌స్పీకర్లు, డీజేలతో అధిక శబ్దాలతో ఆకతాయిలు మద్యం సేవించి అత్యుత్సాహం ప్రదర్శిస్తే పోలీసు చర్యలు ఉంటాయి.

నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

గణేశ్ నిమజ్జనోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి వేడుకలు పూర్తయ్యే వరకు నగరంలోని ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ మళ్లించనున్నట్లు ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. 108, ఫైర్ ఇంజిన్, అంబులెన్స్, పోలీసు వాహనాలు వంటి అత్యవసర సేవల కోసం పోలీసుల అనుమతులు పొందిన వాటిని మాత్రమే నిమజ్జన మార్గంలో అనుమతిస్తారు. కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ నుంచి రాజ్ విహార్, వినాయక ఘాట్ మీదుగా వాహన రాకపోకలపై నిషేధం ఉంటుంది. ఆర్టీసీ బస్సులు బస్టాండ్ నుంచి బళ్లారి చౌరస్తా, కల్లూరు మీదుగా జాతీయ రహదారిపై వచ్చే విధంగా చర్యలు చేట్టారు. నంద్యాల చెక్‌పోస్టు నుంచి నగరంలోకి వచ్చే వాహనాలు సీ.క్యాంప్‌లోని రైతు బజార్, బిర్లాగేట్, గుత్తి పెట్రోల్ బంక్ బైపాస్ రోడ్డు నుంచి కల్లూరు, బళ్లారి చౌరస్తా మీదుగా బస్టాండ్‌కు చేరుకోవాలి. అలాగే డోన్ వైపు నుంచి వచ్చే వాహనాలు గుత్తి పెట్రోల్ బంక్ బైపాస్ మీదుగా బస్టాండ్‌కు చేరుకుంటాయి. నిమజ్జనం పూర్తయిన తరువాత వాహనాలు దేవనగర్, కృష్ణానగర్, కల్లూరు బ్రిడ్జి మీదుగా బయటకు వెళ్లాల్సి ఉంటుంది. మత పెద్దలు, రాజకీయ పార్టీ నాయకులు, శాంతి కమిటీ సభ్యులు సహకరించాలని ఎస్పీ కోరారు. గణేశ్ నిమజ్జన వేడుకల్లో ఏ చిన్న పాటి సంఘటన చోటు చేసుకున్నా బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.